సాక్షి కామారెడ్డి

బుధవారం । 23 । అక్టోబర్ । 2024



పోరాట వీరుడు..
హన్మాజీపేట్ గ్రామంలో కుమురం భీం విగ్రహాన్ని మంగళవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు.
- 8లో ▸



తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి
పిల్లల చదువుల విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని జిల్లా ఇంటర్ బోర్డు నోడల్ అధికారి సలాం సూచించారు.
- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.9 /20.8

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

రైతుల గుండెల్లో తుపాన్!

పంట చేతికి వస్తున్న సమయంలో కురుస్తున్న వర్షాలు అన్నదాతలను ఆగం చేస్తున్నాయి. కోత కోసి ఆరబెట్టిన వడ్లు వర్షానికి తడిసి ముద్దవుతుండడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. కొనుగోళ్లను ప్రారంభించి వేగంగా తూకాలు వేయాలని కోరుతున్నారు.

జిల్లాలో జోరుగా వరి కోతలు
- తూకాలు మొదలు కాకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం
- వర్షాలతో తడుస్తున్న వడ్లు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- కాంటా వేయాలని వినతి


లింగంపల్లిలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 3.14 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ సీజన్‌లో 5.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్న లక్ష్యంతో అధికారులు 419 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా కాంటా మాత్రం ఇంకా మొదలుపెట్టలేదు.

కోతలతోపాటే మొదలైన వానలు

జిల్లాలో వరి కోతలు మొదలైన సమయంలోనే వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జి ల్లాలోని నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, మహ్మద్‌నగర్, ఎల్లారెడ్డి, మాచారెడ్డి, రాజంపేట, బాన్సువాడ, గాంధారి తదితర మండలాల్లో రెండు మూడు రోజులుగా జల్లులతో పాటు అక్కడక్కడ భారీ వర్షాలు కూడా కురుస్తున్నాయి. దీంతో కల్లాల్లో ధాన్యం నా నిపోయి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంటికి రెప్పలా కాపాడుకుని పండించిన పంట చేతి కొచ్చిన తర్వాత వర్షార్పణం అవుతుండడంతో రైతు లు ఆవేదనకు గురవుతున్నారు. కొందరు రైతులు పంటను కోసి కల్లాల్లో ఆరబెట్టారు. మూడు నాలు గు రోజులుగా జిల్లా అంతటా ఆకాశం మేఘావృతమై ఉంటుండడంతో వరి కోయడానికి రైతులు వె నకా ముందవుతున్నారు. వర్షాలకు భయపడి కొందరు కోతలు వాయిదా వేసుకుంటున్నారు. అయితే కోత దశలో వర్షాలు కురుస్తుండడంతో దిగుబడులు తగ్గిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాంటా వేసేదెప్పుడో?

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నప్పటికీ కాంటాలు మాత్రం మొదలు కాలేదు. ముందుగా నాట్లు వేసిన రైతులు పంట నూర్పిడి చేసి, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. అయితే అక్కడ కాంటాలు మొదలుకాకపోవడంతో ధాన్యం నానిపోకుండా చూసుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో పంట ఎక్కడ నానిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. కొనుగోళ్ల ప్రారంభించి కాంటాలు వేగవంతం చేయాలని కోరుతున్నారు. ధాన్యం నానకుండా ప్రభుత్వం టార్పాలిన్లు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే అధికార యంత్రాంగం మాత్రం ఇప్పటికీ ఏర్పాట్లలోనే ఉంది. వర్షాలు కురుస్తుండడం కూడా కాంటాలు ఆలస్యం కావడానికి కారణమని తెలుస్తోంది. మబ్బులు పట్టి ఉండడం, వర్షాలు కూడా కురుస్తుండడంతో తేమ శాతం విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తున్నారు.


పాల్కంపేట కొనుగోలు కేంద్రంలో వడ్ల కుప్పల వద్ద నిలిచిన వర్షం నీరు


మహ్మదనగర్‌లో వడ్ల కుప్పల్లో నిలిచిన వర్షపు నీటిని తోడేస్తున్న రైతులు


శెట్పల్లిలో తడిసిన వడ్లను చూపుతున్న రైతులు

పలుచోట్ల భారీ వర్షం

జిల్లాలో మంగళవారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. నాగిరెడ్డిపేట మండలంలోని నాగిరెడ్డిపేట, గోపాల్‌పేట్, చీనూర్, వెంకంపల్లి, లింగంపేట మండలంలోని పర్మళ్ల, శెట్పల్లి, అయ్యపల్లి, పాల్కంపేట, కన్నాపూర్, మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి, బూర్గుల్, గున్కుల్, మహమ్మద్‌నగర్, నర్వ, హసన్‌పల్లి తదితర గ్రామాలలో వర్షం పడింది. దీంతో కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన ధాన్యం వర్షం నీటికి కొట్టుకుపోయింది. వరి కుప్పలలో నిలిచిన నీళ్లను తొలగించడానికి రైతులు నానా పాట్లు పడ్డారు.

న్యూస్‌రీల్

'విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి'



బీబీపేట : విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా సౌకర్యాలు కల్పించాలని బీసీ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రెటరి తిరుపతి సూచించారు. మండల కేంద్రంలోని జ్యోతీబా పూలే గురుకుల పాఠశాల భవనం ఇరుకుగా ఉండడం, విద్యార్థులు ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాలలో సౌకర్యాలు లేనందున వేరే భవనంలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీంతో ఉన్నతాధికారులు మంగళవారం పాఠశాలను సందర్శించి పరిస్థితులు తెలుసుకున్నారు. మరో భవనం నిర్మించేంతవరకు కొన్ని తరగతుల విద్యార్థులను మరో గురుకుల పాఠశాలకు మార్చుతామని తెలిపారు. మరో భవనాన్ని నిర్మించాలని భవనం యజమానికి సూచించారు. విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వారి వెంట ఆర్‌సీవో సత్యనాథ్ రెడ్డి, సీఈవో చంద్రనాయక్, ప్రత్యేకాధికారి సతీష్ యాదవ్, ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ తదితరులున్నారు.

100 పడకల ఆస్పత్రి ఏర్పాటు దిశగా అడుగులు

కామారెడ్డి టౌన్: దోమకొండలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వంద పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి అడుగులు వేగంగా పడుతున్నాయి. మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దీనికి సంబంధించిన ఫైల్‌పై సంతకం చేసినట్లు తెలిసింది. సీఎం పరిశీలన తర్వాత ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి జీవో విడుదలయ్యే అవకాశాలున్నాయి. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తే దోమకొండతో పాటు చుట్టు పక్కల మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ల్యాబ్ అటెండెంట్స్ 15, డాటా ఎంట్రీ ఆపరేటర్ 7, రెడియోగ్రాఫర్ టెక్నీషియన్ 3, సీటీ టెక్నీషియన్ 3, ఈసీజీ టెక్నీషియన్ 2, అనస్థీషియా టెక్నీషియన్ 3, ధోబీ 4, ఎలక్ట్రీషియన్ 2, ప్లంబర్ ఒకటి, డ్రైవర్ ఒకటి, థియేటర్ అసిస్టెంట్ 2, గ్యాస్ ఆపరేటర్ 2, వార్డు బాయ్ పోస్టులు 4 ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు నవంబర్ 1వ తేదీలోపు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో వెంకటి!

- ఏర్పాట్లు చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నేత


కొంగల వెంకటి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : త్వరలో నిర్వహించే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి కామారెడ్డి జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి సన్నద్ధమవుతున్నారు. అంబేద్కర్ సంఘం ప్రతినిధిగా, ఉపాధ్యాయ సంఘం నేతగా ఉమ్మడి జిల్లాలో క్రియాశీలకంగా పనిచేసిన ఆయన.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పాల్వంచ మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన కొంగల వెంకటి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ టీచర్లను సమీకరించి సంఘాన్ని బలోపేతం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై పలు కార్యక్రమాలు నిర్వహించారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంనుంచి బరిలో దిగుతానని ఆయన బుధవారం 'సాక్షి'తో తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులతో చర్చించానన్నారు. అందరి మద్దతులో ఎన్నికల బరిలో నిలిచి విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

పోలీసు కేటుగాడు!



- బంగారం ఆశ చూపి డబ్బులు వసూలు
- ఓ వ్యక్తికి రూ.17 లక్షల టోకరా వేసిన డీఎస్పీ
- చర్యలు తీసుకున్న ఉన్నతాధికారులు

కామారెడ్డి క్రైం: ఎవరైనా మోసం చేస్తే న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తాం. అయితే బాధితులకు అండగా ఉండి న్యాయం చేయాల్సిన పోలీసు అధికారే దొంగ బంగారం పేరిట డబ్బులు కాజేసిన ఘటన కామారెడ్డి జిల్లాలో చర్చనీయాంశమైంది. వివరాలిలా ఉన్నాయి. గతంలో వరంగల్ జిల్లాలో పనిచేసిన డీఎస్పీ మదన్‌లాల్ ఏడు నెలల క్రితం కామారెడ్డి డీసీఆర్‌బీ విభాగానికి బదిలీపై వచ్చాడు. జిల్లా పోలీస్ కార్యాలయానికి సమీపంలోని ఓ కాలనీలో ఇల్లు కిరాయికి తీసుకుని నివసిస్తున్నాడు. అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తితో కొద్దిరోజుల క్రితం పరిచయం ఏర్పడింది. తనకు తెలిసిన వ్యక్తికి తవ్వకాల్లో గుప్త నిధులు లభించాయని, రూ.6 లక్షలకే కిలో చొప్పున బంగారాన్ని ఇప్పిస్తానని నమ్మించాడు. తాను పోలీసునని, అంతా చూసుకుంటానని చెప్పడంతో నమ్మిన సదరు వ్యక్తి.. రూ. 17 లక్షలకుపైగా ఇచ్చినట్లు తెలిసింది. అయితే రోజులు గడుస్తున్నా బంగారం ఇవ్వకపోవడంతో బాధితుడు 15 రోజుల క్రితం జిల్లా పోలీసు ఉన్నతాధికారిని ఆశ్రయించాడు. దీంతో ఈనెల 6న డీఎస్పీ మదన్‌లాల్‌ను ఐజీ కార్యాలయానికి సరెండర్ చేశారు. అంతేకాకుండా దేవునిపల్లి ఠాణాలో ఈ వ్యవహారంపై కేసు కూడా నమోదు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి రాష్ట్ర అధికారులకు నివేదిక సమర్పించారు. దీంతో డీఎస్పీ మదన్‌లాల్‌ను సస్పెండ్ చేస్తూ రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది. ఈ కేసులో డీఎస్పీతో పాటు మరో ఇద్దరు వ్యక్తుల పాత్ర ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా గతంలో సదరు డీఎస్పీ పనిచేసిన ఇతర చోట్ల కూడా ఫిర్యాదులు ఉన్నాయని సమాచారం. జిల్లాకు వచ్చిన తర్వాత కూడా మాయమాటలు చెప్పి చాలా మంది నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

- బ్లాక్ స్పాట్స్ వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జాతీయ రహదారుల(44, 161)పై ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. టేక్రియాల్, పొందుర్తి, భిక్కనూరు గ్రామాల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. జంక్షన్‌ల వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాలను రోడ్డుపై నిలిపితే జరిమానాలు విధించాలన్నారు. మండల స్థాయిలో పాఠశాల విద్యార్థులతో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బ్లాక్ స్పాట్‌లలో సూచికలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల ప్రాంతాల్లో జీబ్రా లైన్స్ వేయించాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. బ్లడ్ బ్యాంకులలో రక్తం నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహించాలని సూచించారు.

ఆస్పత్రులను తనిఖీ చేయాలి

జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసి రిజిస్ట్రేషన్‌లను పరిశీలించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. రిజిస్ట్రేషన్‌లు లేకుంటే అనుమతులకు సిఫార్సు చేయాలన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ కోసం వచ్చే ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి సిఫార్సు చేయాలన్నారు. జిల్లాలో 127 ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ ఉందని తెలిపారు. తాజాగా మరో 19 ఆస్పత్రులకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. వాటిలో 17 ఆస్పత్రులకు అనుమతులు ఇవ్వడానికి అంగీకరించామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోని ఆస్పత్రులను తనిఖీ చేసి నోటీసులు జారీ చేస్తూనే జరిమానాలు విధించాలని ఆదేశించారు. రిజిస్టర్ అయిన ఆస్పత్రులలో డాక్టర్లు మారితే అందుకు సంబంధించిన సమాచారాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి తెలియజేయాలన్నారు. గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో వైద్యుల పేర్లు, వివరాలు, చికిత్సలకు సంబంధించిన చార్జీల వివరాలు తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఐఎంఏ అధ్యక్షుడు ఎంవీ రమణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోయా కొనుగోళ్లలో కొర్రీలు

- ఎకరానికి సరాసరి 10 క్వింటాళ్ల వరకు దిగుమతి
- 6 క్వింటాళ్లే కొంటామంటున్న సర్కారు
- ఆంక్షలతో ఆందోళనలో అన్నదాతలు

బిచ్కుంద: పంటల సాగులో మెలకువలు పాటించి, అధిక దిగుబడులు సాధించాలని సూచిస్తున్న సర్కారు.. పండిన పంటను సేకరించే విషయంలో కొర్రీలు పెడుతోంది. ఎకరానికి 11 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుండగా.. సర్కారు ఆరు క్వింటాళ్లే కొనుగోలు చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు.

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 85 వేల ఎకరాలలో సోయా సాగయ్యింది. జుక్కల్ నియోజకవర్గంలో నల్ల రేగడి భూములు ఉండడంతో ఈ ప్రాంతంలో ఎక్కువగా సోయా సాగు చేశారు. మూడేళ్ల నుంచి అయితే అతివృష్టి, లేకపోతే అనావృష్టితో పంటలకు నష్టం జరుగుతోంది. ఈసారి సమస్య లేకపోవడంతో పంట బాగా పండింది. ఎకరానికి 8 నుంచి 11 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ఈ పంటకు క్వింటాలుకు రూ. 4,892 మద్దతు ధర నిర్ణయించడంతో మంచి లాభాలు వస్తాయని రైతులు ఆశించారు. అయితే కొనుగోళ్లలో కొర్రీలు పెట్టడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఎంత పంట పండినా ఎకరానికి 6 క్వింటాళ్ల చొప్పునే కొనుగోలు చేస్తామని సర్కారు ప్రకటించడం దళారులకు అనుకూలంగా మారింది. కొనుగోలు కేంద్రాలలో క్వింటాలుకు రూ. 4,892 చెల్లిస్తుండగా.. మార్కెట్‌లో దళారులు ధర తగ్గించి రూ.4,200 లే ఇస్తున్నారు. నల్లగా మారిన సోయాలను రూ. 3,900 లకే కొనుగోలు చేస్తున్నారు. సర్కారు ఆంక్షలతో రైతులు ఎకరానికి ఏడు వందలనుంచి వెయ్యి రూపాయల వరకు నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పండిన పంటనంతా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.


బిచ్కుందలో సోయాలను ఆరబెడుతున్న రైతు

పంటనంతా కొనుగోలు చేయాలి



ఐదెకరాలలో సోయా సాగు చేశాను. ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. అయితే సర్కారు ఎకరానికి ఆరు క్వింటాళ్లే కొంటానంటోంది. మిగిలిన పంటను ఎక్కడ అమ్ముకోవాలి. పంట మొత్తం సర్కారే కొనుగోలు చేయాలి.

– పందరి, రైతు, బిచ్కుంద

ఆలయాలపై దాడులు అరికట్టాలి

- హిందూ సంఘాల డిమాండ్
- బాన్సువాడలో నిరసన ర్యాలీ

బాన్సువాడ : దేవాలయాలపై దాడులను అరికట్టాలని హిందూ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో మంగళవారం నిర్వహించిన బాన్సువాడ బంద్ విజయవంతమైంది. విద్యా, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పట్టణంలోని పెద్ద హనుమాన్ ఆలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు హిందువులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హిందూ ఆలయాలపై దాడులు చేస్తున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బంద్ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమాలలో హిందూ సంఘాల ప్రతినిధులు శ్రీనివాస్, హన్మండ్లు, కోనాల గంగారెడ్డి, శంకర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, విఠల్ రెడ్డి, అశ్విన్, సాయికిరణ్, కోటి హరినాథ్, కిరణ్, శ్రీనివాస్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


బాన్సువాడలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

క్లుప్తంగా

నేలకొరిగిన వరి పంట



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి వరి పూర్తిగా నేలకొరిగింది. నేలకొరిగిన వరి పంటలను ఏఈవో కవిత పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

తడిసిన వరి ధాన్యం



రాజంపేట: రెండు మూడు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరి కోత చేపట్టాక రైతులు రోడ్లపై, కల్లాల వద్ద ఆరబెడుతున్నారు. కల్లాల వద్ద కాపు కాస్తూ కూర్చుంటున్నారు. ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితి ఉండటంతో ఎండబెడుతూ, కుప్ప చేస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి



మద్నూర్(జుక్కల్): కేజీబీవీలో చదువుతున్న విద్యార్థినులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని డీఎల్‌పీవో, ప్రత్యేక అధికారి నాగరాజు ఆదేశించారు. మండల కేంద్రంలోని కేజీబీవీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. పాఠశాలలోని తరగతి గదిలోని విద్యార్థినులతో మాట్లాడారు. పాఠాలు అర్థమయ్యేలా బోధిస్తున్నారా.. భోజనం ఎలా పెడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎంపీవో వెంకటనర్సయ్య, కార్యదర్శి సందీప్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

పోరాట వీరుడు కుమురం భీం



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కాసుల బాలరాజ్



హన్మాజీపేట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం, పక్కన ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ రూరల్: అడవి బిడ్డల హక్కుల కోసం పిడికిలెత్తి పోరాటం చేసిన వీరుడు కుమురం భీం అని బాన్సువాడ ఎమ్మెల్యే, వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన హన్మాజీపేట్‌లో ఆదివాసి నాయక్ పోడ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమురం భీం విగ్రహాన్ని ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. జల్ జంగల్ జమీన్ నినాదంతో నాటి నిరంకుశ పాలకుల గుండెల్లో భయం పుట్టించిన నేత కొమురం భీం అని అన్నారు. కొమురం భీం ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

రైతులు వరిధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతుధరను సద్వినియోగం చేసుకోవాలని పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హన్మాజీపేట్‌లో బోర్లం సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి ప్రారంభించారు.

కుమురం భీంకు ఘన నివాళులు

కామారెడ్డి టౌన్: ఆదివాసీల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు కుమురం భీం జయంతిని బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరు ఆయనని ఆదర్శంగా తీసుకోవాలని గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు నవీన్‌నాయక్ అన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు రవి, బాలు, రంజిత్ తదితరులున్నారు.



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కులవృత్తులతో ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

భిక్కనూరు: కులవృత్తులతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం జంగంపల్లిలోని చెరువులో ఆయన చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆధునిక కాలంలో కూడా కులవృత్తులకు ఆదరణ ఏమాత్రం తగ్గలేదన్నారు. అనాదిగా వస్తున్న కులవృత్తులను చిన్నచూపు చూడవద్దన్నారు. చేపలకు మంచి డిమాండ్ ఉందని, చేపలను పెంచి పట్టుకుని విక్రయించుకుంటే వారు ఎంతగానో ఆర్థికాభివృద్ధిని సాధిస్తారన్నారు. మండల ప్రత్యేకాధికారి రజిత, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజకిరణ్‌రెడ్డి, మత్స్య శాఖాధికారి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జంగంపల్లి చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

25న సీడీఎంఏ కార్యాలయం ముట్టడి

కామారెడ్డి టౌన్: మున్సిపల్ కార్మికుల క్రమబద్ధీకరణ, కనీస వేతనం అమలు, తదితర డిమాండ్‌ల పరిష్కారం కోసం ఈనెల 25న హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయం ముట్టడి చేపడుతున్నట్లు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు తెలిపారు. ఈ మేరకు ధర్నాకు కార్మికులు తరలివెళ్లడానికి అనుమతి ఇవ్వాలని మంగళవారం మున్సిపల్ కమిషనర్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని మున్సిపల్ కార్మికులంతా ఈ ధర్నాకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ జిల్లా కార్యదర్శి మహబూబ్, కార్మికులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ఆర్గొండలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాజంపేట: ఆర్గొండలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సింగిల్ విండో అధ్యక్షుడు కంది శివరాములు ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బుట్ట రాజు, ధరిపల్లి దుర్గారెడ్డి, శివ్వయ్య, ప్రణీత్ రెడ్డి, సీఈవో సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

నా స్టైలే వేరు



మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో ఓ ఇంట్లో చొరబడ్డ కోతి దర్జాగా రాజసం ఉట్టిపడేలా కూర్చుంది. దీంతో ఇంటి యజమాని క్లిక్ మనిపించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

'గాలికుంటు' ప్రమాదకరమైన వ్యాధి



మద్దికుంటలో పశువులకు టీకాలు వేస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి శ్రీనివాస్



మహమ్మద్‌నగర్‌లో టీకాలు వేస్తున్న వైద్యుడు సయ్యద్ యూనుస్

- పశుసంవర్ధక శాఖాధికారి శ్రీనివాస్

రామారెడ్డి: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి ప్రమాదకరమైనదని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి శ్రీనివాస్ అన్నారు. మద్దికుంటలో మంగళవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. గాలికుంటు వ్యాధి గాలి ద్వారానే ఒక పశువు నుంచి ఇంకో పశువుకు వ్యాపిస్తుందని దీని నివారణకు టీకాలే మార్గమని సూచించారు. ఈ వ్యాధి సోకిన పశువుకు జ్వరం రావడంతో పాటు నోటిలో, కాళ్ల గిట్టలలో పుండ్లు ఏర్పడుతాయని నోటిలో నుంచి చొంగ కారుతుందని వివరించారు. పాల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని తెలిపారు. ప్రభుత్వం టీకాలు ఉచితంగా సరఫరా చేస్తుందని చెప్పారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ రామచందర్, సహాయ సంచాలకులు సంజయ్ కుమార్, సిబ్బంది శ్రీనివాసరావు, నారాయణ, రమేష్ ఆంజనేయులు దశరథ్, పాడి రైతులు పాల్గొన్నారు.

మహమ్మద్‌నగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): మూగజీవాల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నామని మండల పశువైద్యుడు సయ్యద్ యూనుస్ తెలిపారు. మంగళవారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గోపాల మిత్రలు సిద్ధు, రఘు, రాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



సుచరిత

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పేట్‌సంగెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని సుచరిత రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ లక్ష్మణ్ మంగళవారం తెలిపారు. వచ్చే నెల 3 నుంచి 6 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే పోటీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి విద్యార్థిని ప్రాతినిధ్యం వహిస్తుందని పీఈటీ చెప్పారు.

సోమారంపేట విద్యార్థి..



మాచారెడ్డి: సోమారంపేట ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి నరేందర్ అండర్-17 బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ తెలిపారు. వచ్చే నెల 3న మహబూబ్‌నగర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థిని అభినందించారు. పీఈటీ సంధ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, పోశెట్టి, చంద్రకళ, స్వరూపరాణి, సంతోష, రజిత ఉన్నారు.

ఉప్పల్‌వాయి గురుకుల క్రీడాకారుల ప్రతిభ



రామారెడ్డి: ఈ నెల 17నుండి 19 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో ఉప్పలవాయి సాంఘిక సంక్షేమ గురుకుల క్రీడాకారులు ప్రతిభ చూపారు. అథ్లెటిక్స్ అకాడమీ క్రీడాకారుడు కె. ప్రవీణ్ తెలంగాణ తరపున పాల్గొని రజత పతకం సాధించినట్లు కోచ్ సురేష్ తెలిపారు. గెలుపొందిన క్రీడాకారుడిని కళాశాల ప్రిన్సిపల్ శివరామ్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.మోహన్ రెడ్డి, పీడీ రాజరత్నం, పీఈటీ మహేష్, కళాశాల సిబ్బంది అభినందించారు.

సంయుక్త సర్వే షురూ..

గాంధారి(ఎల్లారెడ్డి): గౌరారం శివారులో ఆక్రమణలకు గురైన అటవీ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. మంగళవారం గ్రామస్తులతో కలిసి రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. సర్వే పూర్తి కాగానే హద్దులు నిర్ణయిస్తామని తెలిపారు.



పోలీసు అమరవీరులకు నివాళులు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో పలు పాఠశాలల విద్యార్థులు మానవహారంగా ఏర్పడి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించిన అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఎల్లారెడ్డి: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ఎల్లారెడ్డి పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో పోలీసులు విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. ఎస్సై మహేష్, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

క్రైం కార్నర్

వైన్ షాప్, కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు



దోమకొండ: మండల కేంద్రంలోని వైన్ షాప్‌తో పాటు కల్లు దుకాణాలపై మంగళవారం ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. లిక్కర్ స్టాక్, పర్మిట్ రూమ్, పరిసరాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాలను పరిశీలించారు. అదేవిధంగా ట్రేడ్ లైసెన్స్ కూడా సంబంధిత అధికారుల నుంచి పొందారా లేదా అని పరిశీలించినట్లు ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావ్ తెలిపారు. అదేవిధంగా కల్లు దుకాణాలలో కూడా తనిఖీలు నిర్వహించి నమూనాలను సేకరించి కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడుల్లో ఎస్సై సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

దోమకొండ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత తన ఇద్దరు కుమారులతో కలిసి మంగళవారం అదృశ్యమైనట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కుమారులు ఇద్దరు పాఠశాల నుంచి రాగానే తల్లి తన వెంట తీసుకెళ్లినట్లు కుటుంబీకులు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బిచ్కుంద: మండలంలోని కందర్‌పల్లి శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.18,440 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

మేనూర్‌లో..

మద్నూర్(జుక్కల్): మండలంలోని మేనూర్ శివారులో మంగళవారం రాత్రి పేకాట స్థావరంపై దాడిచేసినట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు. పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేయగా ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 9,650 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం (బి)లో మంగళవారం సాయంత్రం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన రాధికకు చెందిన గేదె గ్రామ శివారులోని శ్రీనిధి వెంచర్ వద్ద గడ్డిని మేస్తుండగా అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో విద్యుత్ తీగ తెగిపడి ఉంది. గేదె విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా రూ.60వేల విలువగల గేదె మృతి చెందినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గేదె స్థానంలో మనుషులు ఉంటే ఎవరు బాధ్యులని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు..



దోమకొండ: మండల కేంద్రానికి చెందిన ఎర్రని దత్తయ్య మేకలు మంగళవారం కుక్కల దాడిలో మృతిచెందాయి. గొర్రెలను మేపడానికి తీసుకెళ్తున్న సమయంలో కుక్కలు దాడి చేయగా 8 గొర్రెలు మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

కూలి కోసం వచ్చి మృత్యు ఒడిలోకి..

- మోర్తాడ్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఖమ్మం వాసి మృతి
- కేసు నమోదు చేసిన పోలీసులు

మోర్తాడ్: కూలీ పని కోసం వచ్చిన ఓ వ్యక్తి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన ఘటన మోర్తాడ్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై విక్రమ్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కలకొడవ గ్రామానికి చెందిన కాకర్ల గోవింద్(54) బతుకు దెరువు నిమిత్తం మోర్తాడ్‌కు సోమవారం రాత్రి భార్యతో కలిసి బస్సులో వచ్చాడు. కొద్దిసేపు అక్కడే ఉండి ఓ చెట్టు కిందికి చేరుకున్నారు. కొంత సేపటికి బయటకు వెళ్లిన గోవింద్ గాండ్లపేట్ రోడ్డు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. స్థానికులు వైద్యం కోసం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా భర్త మృతదేహం వద్ద భార్య లక్ష్మి దీనంగా కూర్చుండడం అందరినీ కలిచివేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..

మోర్తాడ్: మండలంలోని గాండ్లపేట్ శివారులో జాతీయ రహదారిపై వ్యక్తి తీవ్రగాయాలతో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఉదయం గాండ్లపేట్ శివారులో రక్తం కారుతూ ఉన్న వ్యక్తిని కొందరు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారని వెంటనే తాము ఘటన స్థలానికి చేరుకొన్నట్లు తెలిపారు. వెంటనే అతన్ని ఆర్మూర్‌కు చికిత్స నిమిత్తం తరలించినట్లు పేర్కొన్నారు. వ్యక్తికి గాయాలు ఎలా అయ్యాయో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712659867, 8712659768 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

చెరువులో పడి మహిళ..

భిక్కనూరు: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన భిక్కనూరు మండల కేంద్రంలోని కొత్తచెరువులో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పాపూర్ గ్రామానికి చెందిన జొర్రిగల దుర్గవ్వ(65)కు కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదు. దీనికి తోడు ఆమె తరచూ ఫిట్స్‌తో బాధపడుతోంది. మంగళవారం ఇంటి నుంచి భిక్కనూరుకు వచ్చిన దుర్గవ్వ బస్టాండ్ సమీపంలో ఉన్న బొబ్బిలి చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు జారి చెరువులో పడిపోయింది. మృతదేహం నీటిలో తేలడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించగా దుర్గవ్వ మృతదేహంగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతురాలి భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిడుగు పడి కొడుకు మృతి.. తండ్రికి గాయాలు

నాగిరెడ్డిపేట: కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని బొల్లారం గ్రామంలో పిడుగు పడి కొడుకు మృతి చెందగా, తండ్రికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బొల్లారం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు మంద నాగభూషణం, మంద వెంకటేశం (25) మంగళవారం గ్రామ శివారులోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వడ్లను ఆరబెట్టేందుకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో అకాల వర్షం రావడంతో చెట్టు కిందకు వెళ్లారు. చెట్టుపై పిడుగు పడటంతో వెంకటేశం అక్కడికక్కడే మృతి చెందాడు. నాగభూషణంకు కాలికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ఆర్మూర్ టౌన్: రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆర్మూర్ మండలం అంకాపూర్ రైల్వేస్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అంకాపూర్ రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి (50) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712658591 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

అనారోగ్యంతో మరొకరు..

నస్రుల్లాబాద్: అనారోగ్యంతోబాధపడుతున్న ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నస్రుల్లాబాద్ మండలం బొమ్మదేవ్‌పల్లిలో చోటు చేసుకుంది. ఏఎస్సై వెంకట్‌రావు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన చాకలి గంగారాం(45) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో జీవితంపై విరక్తితో గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

లింగంపేట: బైక్‌ను బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన లింగంపేట మండలంలోని మెంగారం శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ కామారెడ్డిలో అడ్డ కూలీగా పనులు చేసుకొని రాత్రి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వైపు వెళ్తున్న బస్సు శ్రీకాంత్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కాగా స్థానికులు కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బడాభీమ్‌గల్‌లో..

మోర్తాడ్: భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్ శివారులో ఓ బైక్‌ను ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఓ పాఠశాల బస్సు విద్యార్థులను గొనుగొప్పులలో దింపి భీమ్‌గల్‌వైపు వస్తుండగా బడాభీమ్‌గల్ వద్ద బస్సు డ్రైవర్ జావిద్ అజాగ్రత్తతో బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న తేలవత్‌రాజు, విఠల్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వైద్యం కోసం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో జడ్జి ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం పేర్కొన్నారు. నగరంలోని నాలుగవ టౌన్ పీఎస్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్‌లో నిర్వహించగా మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లికి చెందిన వంశీని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

ధర్పల్లిలో మరొకరికి..

ధర్పల్లి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జడ్జి రెండు రోజుల జైలు విధించినట్లు ఎస్సై రామకృష్ణ మంగళవారం పేర్కొన్నారు. ధర్పల్లి మండలానికి చెందిన కచ్చకాయల గంగాధర్ మద్యం సేవించి వాహనం నడుపుతుండగా తనిఖీలో పట్టుబడినట్లు తెలిపారు. అతన్ని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇద్దరు నిందితుల అరెస్టు

వేల్పూర్: మండల కేంద్రంలో ఆదివారం చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై నాగ్‌నాథ్ పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌కు చెందిన షేక్ జలాలుద్దీన్, నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన భూంపల్లి సంతోష్ అనే ఇద్దరు వడ్రంగి పనిచేసేవారు. తమ జల్సాల కోసం సులువుగా డబ్బులు సంపాదించడానికి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారన్నారు. లక్కోర శివారులో ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానంతో తిరుగుతుండగా పట్టుబడ్డారన్నారు. చేసిన నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.